
# శ్రీ గోపాళోపనిషత్తు
అను
# ప్రమాదో ధీమతామపి



అనగనగా ఒక రాధమ్మ అంతకుముందో గోపాళం అం--తకు ముందో చిన కథగాని కథ.

రాధమ్మ ఏ వంటలు ఎంత బాగా చేసినా ఓ వంక పొగుడుతూనే మరో వంక వంకలు పెట్టేవాడు గోపాళం.

"మీ ఆడాళ్ల వంటింటి కుందేళ్లు. వండినవే మళ్లీ వండుతారు. ఎక్స్పెరిమెంటేషన్ లేదు. కొత్తదనం కోసం ట్రై చెయ్యరు మా వంటివాళ్లు చెప్పినా - మాటవరసకి 'గోంగూరా కందకూరా, కొతిమీరా కలిపి ఎందుకు వండరూ' అని అడిగితే 'ఏడిసినట్టుంటుంది' అని పొగరుగా తల ఎగరేసి అందంగా నవ్వేస్తారు... ఆ రేగిన జుట్టు మెడ మీద జడో నవ్వో పువ్వో చూడడంలో పడి చీకటి కమ్మేసి 'వండితేగదా ఏడిసినట్లుంటుందని తెల్తుందీ వందూ' అని నిలదీసి అర్థర్లెయ్యడం మర్చిపోతాం" అన్నాడు గోపాలం.

ఆ తరవాత పంతం వచ్చి (మాలతీ చందూర్‌గారి) వంటలూ పిండి వంటలూ కొనేసి ఆఫీసులో పెట్టి సీక్రెట్‌గా చదివేసి వంటలశాస్త్రం బాపులా వంట పట్టించేసుకున్నాడు. ఒక ఆదివారంనాడు 'నేడే నా వంట విడుదల' అని రాధమ్మని ఒట్టేసి కుర్చీక్కట్టేసి, కాఫీ ఇచ్చి పేపరు చదువుకోమని వంటారంభించాడు.

అంతకుముందే వెలిగించిన స్టౌ మీద అంతకుముందే రెడీగా ఉండాల్సిన పోపులు వేయించి పడేశాడు. కూరలు తరగడానికి కూర్చున్నాడు.

"పేపరెందుకు చిరాకు. పద్దు పుస్తకం చూసుకుంటూ లేదా వారపత్రిక –" అంది రాధ.

"అబ్బే అదే మా స్టయిల్ కరెక్టుగా ఉండాలి. నువ్వు వంట చేస్తున్నప్పుడు నేనెలా పేపరు చూస్తుంటానో నువ్వు కూడా అలాగే ఉండాలి."

"అంటే కాఫీ తాగాక సిగరెట్టు కూడా కాల్చాలా?" అంది రాధ భయం నటిస్తూ.

"పద్దు రెండే ఉన్నాయి – బైటికెళ్లేదాకా" అంటూ విరగబడి నవ్వేసి అంతకుముందే నిలబెట్టిన కత్తిపీట పక్కన అంతకుముందే గుట్టలు పోసిన కూరగాయల్లోంచి బెండకాయలు తీసి నిలువుగా తరిగేశాడు. వేళ్లకంటుకున్న జిగురును రాధ చూసిందేమోనని చేతులు వెనక్కేసుకుని బనీనుకు తుడిచేస్తున్నాడు.

రాధ పకపక నవ్వింది.

"చూడు నేను వంటల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు చదివానుగాని ఎలిమెంటరీ చదువు గమనించలేదు. క్లిష్టమైన వంటలు నేర్చానుగాని కూరలు తరగడం స్టడీ చెయ్యలేదు. ఏదో బెండకాయని నిలువుగా తరిగాను – ప్రమాదో ధీమతామపి – గొప్పవాళ్లు కూడా తప్పులో కాలేస్తారు" అంటూ లేచి, చేటలో ఉండే కందిపప్పు మీద కాలేసి తొక్కి, కుళాయి దగ్గరకెళ్లి జిగురు చెయ్యి కడుక్కువచ్చాడు.

"కూరలు అడ్డంగా తరగాలని చెప్పడానికి అనుభవం గట్రా అక్కర్లేదు –కామన్ సెన్సు చాలు" అని పెడసరంగా చూస్తూ మామిడికాయని అడ్డంగా కత్తిపీటకేసి తరగబోయాడు. మధ్యలో టెంక ఒప్పుకోలేదు.

రాధ మళ్లీ నవ్వబోయి, చూపుడు వేలితో నోరును అదుపు చేసింది.

"ఓహో! కొన్ని అడ్డం నిలువూ కాదు అయి మూలగా తరగాలన్నమాట.... తెలుసు"

అంటూ కొత్తిమీర కట్టలు తీసి రాధకేసి గీరగా చూస్తూ చేతులు బాగా పైకెత్తి జోరుగా తరగబోయాడు.

రాధ కళ్లు పెద్దవి చేసి బెదిరి చూసి "చెయ్యి చెయ్యి" అంది. గోపాలం ఆ భంగిమలోనే ఆగాడు.

"రాధగారూ! ఏవిటా ఏకవచన ప్రయోగం" అంటూ కొత్తిమీర పట్టుకున్న చేతిని జోరుగా కత్తి మీదకు తెచ్చాడు 'అమ్మో' అన్నాడు.

రాధ పరుగున వచ్చి వాలింది.

వేలు తెగింది. నెత్తురుబొట్లు పడ్డాయి.

రాధ చేయందుకుని పైకెత్తింది. గోపాలం కంటిలోంచి రెండు కన్నీటి బొట్లు రాలాయి.

"హా! రక్తం –కన్నీరు!"

"రక్తకన్నీరు అని నాగభూషణంగారి డ్రామా"

"స్కూలుపిల్లల నాటకంలో జోకులా ఉంది" అంటూ రాధ గిన్నెలో నీళ్లు తీసి వేలిమీద పోసి తుడిచింది. వేలు నోట్లో పెట్టుకుంది – కళ్లు మూసుకుని.

గోపాలం వేలు లాక్కున్నాడు. లేచి నించుని రెచ్చిపోయాడు.

"అంటే నేను కుర్ర సన్నాసినంటావు నాకు వంట రాదంటావ్. కూర తరగడంలో ఒక్క చిన్న తప్పు చేసినందుకు మొత్తం డిస్క్వాలిఫై చేసి ఎందుకూ పనికిరానంటావ్. ప్రమాదో ధీమతామపి అనగా గొప్ప గొప్ప వాళ్లు కూడా ఒక్కోసారి తప్పులు చేస్తారు అని పెద్దలు చెప్పారు తెలీదా?

ఒకోసారి బస్సులో కండక్టరు మనం రూపాయిస్తే పది పైసలు చిల్లరిచ్చేస్తాడు. అతను కండక్టరుగా పనికిరాడంటావా? బ్యాంకులో క్యాష్ కీపర్ టోకెన్ తీసుకుని నవ్వుతూ క్యాష్ చేతికిస్తాడు. బ్యాంకు వాళ్లు అయన్ని బర్తరఫ్ చేస్తారా? ఆ?

ఒక్కోసారి పీవీగారు పైకి నవ్వేస్తారు. పాలసీ మారిపోయిందంటామా?

అప్పారావు అరగంట కబుర్లు చెప్పి కూడా అప్పు అడక్కుండా వెళ్లిపోతాడు. వయసు మళ్లిందంటామా?

బుడుగు అల్లరి చెయ్యడు. వయసు పెరిగిందంటామా?

"ఒక్కోసారి సిటీ బస్సులు సరిగ్గా స్టాపువద్ద రోడ్డు ప్రక్కన అగుతాయి. ఆ డ్రైవర్ని యూనియన్ వాళ్లు వెలివేస్తారా? బస్సంటే గుర్తొచ్చింది. ఒక్కోసారి బస్సుకి సడెన్ బ్రేకులు పడ్డా రోమియోలు జూలియట్ల మీదకు తూలిపడరు. వాళ్ల చేవ తరిగిందంటామా? ఆ?

ఒక్కోసారి గిరీశం కోతలు కొయ్యడు – సన్యాసైపోయాడంటావా?

ఒక్కోసారి దేశసేవకులు నిజంగానే దేశసేవ చేసేస్తారు. వాళ్లని ఎలక్షన్కి డిబార్ చేస్తారా?

ఒక్కోసారి పొలిటీషియన్ ప్లేటు ఫిరాయించడు. అతనికి మెంటల్ అంటారా?

ఒక్కోసారి వినయం చాలా ఎక్కువగా ఉందని సన్మానం చేస్తారు. అయినా కొమ్ములు మొలవ్వు. ఇచ్చిన అవార్డు లాక్కుంటారా?

ఒక్కోసారి వెలిసిపోయిన పెళ్లాం వెన్నెల బొమ్మలా అందంగా కనిపిస్తుంది. కళ్లజోడు మార్చేసుకోమంటావా?

అంతెందుకు ఒక్కోసారి పెళ్లాం వేసిన జోకులక్కూడా నవ్వేస్తారు. వాళ్లు చండీదాసులంటావా?

గవర్నమెంటాఫీసులో ఒక గొప్పవాడు పది నుంచి అయిదాకా పనిచేస్తాడు. శుక్రవారం మధ్యాహ్నం కూడా పనిచేస్తాడు. 'యూనియన్ ద్రోహి' అంటామా!

ఒక్కోసారి ధర్మం జయిస్తుంది. అంతమాత్రాన రాక్షసులు ఆత్మహత్యలు చేసుకోవాలా?

ఒక్కో పోలీసు బీదవాళ్లతో కూడా పొలైట్గా చిరునవ్వుతో మాట్లాడతాడు. అతనికి ప్రమోషన్ రద్దు చేస్తారా?

అందరూ తెలీక తప్పులు చెయ్యరు. కొందరు తెలిసీ చేస్తారు. వాళ్లనను –నన్ను కాదు. 'పంచ-దారకన్న పరదార తీపిరా' అని కృష్ణశాస్త్రిగారు అన్నారు. అది సందర్భానుకూలం. అవసరమైతే పెళ్లాన్ని ప్రేమించేవాళ్లూ ఉన్నారు. అవకాశముంటే ప్రియురాలిని పెళ్లాడే వాళ్లూ ఉన్నారు. నేను అలాటివాణ్ణి కాను సుమీ నువ్వు కంగారుపడకు. నేను ఆంధ్రా రాముడిని..."

"ఆంధ్రా రాముడంటే?" అంది రాధ.

"రావికొండలరావునడగాలి. ఇప్పుడు వీల్లేదు కనక నేనే చెప్తాను. అసలు - రాముడు వేరే ఉన్నాడు కదా అయన యు.పి.వాడు గదా. అలాటి గొప్పవాళ్లు మనలో ఉన్నప్పుడు 'ఆంధ్ర-ఫలానా' అంటారు.

"వాల్మీకి రామాయణాన్ని తెలిగించిన వావిలికొలను సుబ్బారావుగారిని 'ఆంధ్ర వాల్మీకి' అంటారు. సైగల్‌లా పాడతాడని పేరు తెచ్చుకున్న ఎమ్మెస్ రామారావును 'ఆంధ్రా సైగల్' అంటారు. మహా నటుడు చిత్తూరు నాగయ్యగారిని 'ఆంధ్రా పాల్‌ముని' అనేవారు."

ఇంత దీర్ఘోపన్యాసం వినలేక వింటున్నట్లు నటిస్తూ వార్తాపత్రిక చూస్తున్న రాధమ్మ పేపరు పైకెత్తి చూపిస్తూ అడిగింది.

"ఏవండీ అయితే మరీ...?"

"అడుగూ...?"

"ఇందులో ఆంధ్రా బ్యాంకు వారి సంక్రాంతి సంబరాలు అని రాశారు. ఆంధ్రా బ్యాంకు ఇదైతే మరి అసలు బ్యాంకు ఏదండీ?"

★★★